కథ

# దెబ్బకు దెబ్బ

రాచపూటి రమేష్

యాత్రికులకు గదులు కేటాయించే సీఆర్వో ఆఫీసు ప్రాంగణం రద్దీతో కిటకిట లాడుతోంది. అసలే అది తిరుమల, ఆ పైన వేసవి సెలవులు కావడంతో ఇసుక వేస్తే రాలని జనస మూహం అక్కడ కనిపిస్తోంది.

అరగంట నుంచీ ఓపికగా క్యూల్యో కాచుకొని వున్నాడు సరోజ్. చెన్నై నుండి ఆ ఉదయమే తిరుపతికి చేరుకున్నాడతను. వీలైతే సాయంత్రంలోగా దర్శనం ముగించుకొని, రాత్రికి ఏ ఎక్స్‌ప్రెస్ ట్రైన్లోనో హైదరాబాద్ చేరుకోవాలనుకున్నాడతను. కానీ రద్దీ చూస్తూంటే అది సాధ్య పడేలా లేదు.

మరో పావుగంట తరువాత సరోజ్ వంతు వచ్చింది.

''మంచి కాటేజ్, రీజనబుల్ రెంట్‌తో, ఏ ప్రాంతంలోనైనా ఫర్వా లేదు'' అని ఐదువందల రూపాయల నోటు కౌంటర్‌లోని గుమాస్తా కందజేయబోయాడు. రిసెప్షన్‌లో వున్న బట్టతల శాల్తీ సరోజ్‌ని ఎగాదిగా చూశాడు.

''ఎంతమందుంటారు గదిలో''
నోటు తీసుకోకుండా ప్రశ్నించాడు.

''ఏం, నేనొక్కణ్ణే. ఎందుకడుగుతున్నారు?'' అనుమానంగా అడిగాడు సరోజ్.


''సారీ, ఒక్కరే వుంటే గదిని అలాట్ చేయలేం. ఇక్కడి రూల్స్ ఒప్పుకోవు. నెక్ట్స్'' సరోజ్ వంక విసుగ్గా చూసి చెప్పాడు క్లర్కు.

ఉసూరుమనుకుంటూ క్యూ నుంచి బయటకు వచ్చాడు సరోజ్. గంట సేపు క్యూలో నిలబడితే చివరకా గుమాస్తా శలవిచ్చిన విషయం అతని ఉత్సాహంపై నీళ్లు చల్లింది.

''బాచిలర్స్‌కు అద్దెకు రూంలే కాదు, ఆఖరుకు కాటేజీలు కూడా దొరకడం లేదు. అంతా కాలమహిమ'' అనుకుంటూ నెస్‌కేఫ్ అమ్ముతున్న పార్లర్ వైపు నడిచాడు.

ఒక జాతీయ బాంకులో క్లర్క్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు సరోజ్. ముప్పై ఏళ్లు సమీపిస్తున్నా ఇంకా అవివాహితుడుగానే వున్నాడు. రెండేళ్ల క్రితం వరకూ చెల్లెళ్లిద్దరికీ సరైన మేచెస్ కుదరకపోవడంతో, అతను తన పెళ్లిని వాయిదావేస్తూ వచ్చాడు. ఇప్పుడు వాళ్లకు పెళ్లిళ్లై సంసారాలు చేసుకుంటున్నా సరోజ్ తండ్రికున్న జాతకాల పిచ్చితో సరైన సంబంధం దొరక్క పెళ్లి పోస్ట్‌పోన్ చేయవలసి వస్తోందతను.

స్వతహాగా మంచి చిత్రకారుడైన సరోజ్ అప్పుడప్పుడూ తాను వేసిన పెయింటింగ్స్‌ను ఆర్ట్ ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శిస్తూ వుంటాడు. ఇప్పుడూ ఆ పనిమీదే రెండురోజులు శలవులు కలసి రావడంతో, చెన్నైలోని ఒక ఆర్ట్ ఎగ్జిబిషన్లో పాల్గొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఎలాగూ చెన్నై వరకూ వచ్చాడు కాబట్టే తిరుమలేశుని దర్శనం చేసుకొని వెళ్లాలనుకున్నాడు సరోజ్. కానీ ఒంటరిగా వచ్చి ఆత్మహత్యలు



చేసుకొనేవారు ఎక్కువవడంతో, ఒక్కరికి తిరుమలలో కాటేజ్‌లు అలాట్ చెయ్యరని తెలియదతనికి.

'పోనీ సరాసరి దర్శనానికి వెళ్లిపోతేనో' అనుకున్నాడు సరోజ్ ఓ క్షణకాలం పాటు. కానీ, వెంటనే ఆ ఆలోచన మానుకొన్నాడు. స్నానమూ, పానమూ లేకుండా గుడికి వెళ్లరాదని అనిపించిందతనికి. . పైపెచ్చు దర్శనం కూడా ఆలస్యమయ్యేట్లుంది. గది తీసుకోక తప్పేట్లు లేదు.

''ఎక్స్‌క్యూజ్‌మీ'' ఎవరిదో గొంతు విని కాఫీ తాగుతున్న సరోజ్ పక్కకు తిరిగాడు. తెల్లటి టీషర్ట్, బ్లాక్ కలర్ జీన్స్‌లోకి టక్ చేసి వున్న కళ్లజోడు యువకుడు, భుజాన లెదర్‌బేగ్‌తో నిలుచుని వున్నాడు. అతణ్ణి తాను ఇదివరకు చూసినట్లు సరోజ్‌కనిపించలేదు.

''మీరొక్కరే వున్నారా? ఐ మీన్, ఇందాక క్యూనుంచి బయటకు వస్తోంటే చూసాను'' అన్నాడతను, మాటల్లో తమిళయాస.

''ఔను, ఒకడ్నే అవడంతో కాటేజ్ ఇవ్వలేదు'' కాఫీ తాగిన ప్లాస్టిక్‌గ్లాస్‌ను చెత్తబుట్టలోకి వేస్తూ అన్నాడు సరోజ్.

''నాదీ అదే ప్రాబ్లం. తెలియక ఒక్కడినే వచ్చాను, నిన్న విజయవాడ నుంచి. ఇలా ఒక్కరికి రూం ఇవ్వరని తెలుసుంటే ఎవరో ఒక ఫ్రెండును బతిమాలి తీసుకొచ్చుండేవాణ్ణి. బైదిబై, మనమిద్దరం కలిసి కాటేజ్ తీసుకుందామా? మీకభ్యంతరం లేకపోతేనే'' అన్నాడు కళ్లజోడులోని యువకుడు.

సరోజ్‌కి ప్రాణం లేచి వచ్చినట్లైంది. ''అలాగే చేద్దాం'' అని కౌంటర్ వైపు నడిచాడు.

''మీరాగండి, నేను క్యూలో నిలబడతాను'' అని ఆ అబ్బాయి మరో కౌంటర్ క్యూలో నిలుచున్నాడు. సరోజ్ అతనికి ఐదువందల రూపాయల నోటు నందించాడు. ఇరవై నిమిషాల్లో కౌంటర్ విండో వద్దకు చేరుకున్నాడతను.

''మేం ఇద్దరం ఫ్రెండ్స్ కలిసి వచ్చాము. మంచి కాటేజ్ ఇవ్వండి'' అన్నాడు కౌంటర్‌లోని క్లర్కుతో. గుమాస్తా కౌంటర్ విండోలోంచి సరోజ్ వైపు చూశాడు. ఔనన్నట్లు తలాడించాడు సరోజ్.

''ఇదిగోండి మన గది అలాట్‌మెంట్ స్లిప్'' కంప్యూటర్‌లోంచి తీసిన స్లిప్‌ను సరోజ్‌కందజేస్తూ, చిల్లర కూడా ఇచ్చి చెప్పాడతను. ''బైదిబై నాపేరు అశోక్, నేను ఆర్‌టిసీ వర్క్‌షాప్‌లో పనిచేస్తాను విజయవాడలో'' అన్నాడు చేయి చాపుతూ. సరోజ్ అతనితో కరచాలనం చేసి, తన వివరాలను క్లుప్తంగా చెప్పాడు.

ఇద్దరూ శంఖుమిట్ట ప్రాంతంలోని రిసెప్షన్ ఆఫీసుకు చేరుకొని, అక్కడి గుమాస్తాకు తమ టికెట్ అందజేశారు. రిసెప్షనిస్టు దాన్ని పరిశీలించి మరొక ఫారమ్‌ను అశోక్‌కందజేశాడు.

''సారీ, నేను ఇంగ్లీషులో సరిగ్గా రాయలేను. మీరీ ఫామ్‌ను నింపండి'' ఫారమ్‌ను సరోజ్‌కందజేస్తూ చెప్పాడు అశోక్. సరోజ్ ఫారమ్‌ను పూర్తి చేసి, సంతకం చేసి కౌంటర్‌లోని వ్యక్తికందజేశాడు.

''కోటయ్యా, వీరికి గదిని చూపించు'' ఖాకీ దుస్తుల్లో వున్న కాటేజీల అటెండర్‌కు చెప్పాడు రిసెప్షనిస్టు. ''రండి సార్'' అని తాళాల గుత్తితో బాటు నడిచాడు అటెండర్. అతని వెనుకే బయల్దేరారు అశోక్, సరోజ్‌లు.

''ఇదే సార్, మీకు అలాట్ చేసిన కాటేజి'' తాళం తెరచి చెప్పాడు అటెండరు. రెండుగదులు, మంచాలు, కుర్చీలు, ఫ్యాన్‌తో శుభ్రంగానే వుంది గది. బెడ్‌షీట్లు, దిండు గలేబులు శుభ్రంగా వుతికి వున్నాయి.

''రండి సార్, ముందు ఇద్దరం వెళ్లి దర్శనానికి కంకణం కట్టించుకొని వద్దాం. నాకు తెలిసిన వాళ్లొక్కరిద్దరు వున్నారు. వీలైతే త్వరగా దర్శనం ముగించుకొని వచ్చెయ్యవచ్చు'' చెప్పాడు అశోక్. గదికి తాళం వేసి అశోక్‌తో బాటు నడిచాడు సరోజ్.

ఇద్దరూ సుదర్శనం కౌంటర్ వద్దకు వెళ్లి దర్శనానికి కంకణాలు కట్టించుకున్నారు. రాత్రి తొమ్మిదింటికి దర్శనానికి సమయం కేటాయించారు వారికి.


సరోజ్ హతాశుడైనాడు. అశోక్ 'ఖాకీ యూనిఫాం'లో వున్న ఒకరిద్దరితో ధారాళంగా తమిళంలో మాట్లాడుతున్నాడు.

''నాలుగింటికే ఇద్దర్నీ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ దగ్గరకు రమ్మన్నాడు నాకు తెలిసిన స్టాఫ్ పర్సన్. లక్కీగా దొరికాడు. అంతగా ఆశ్చర్యపోకండి. మేమింట్లో మాట్లాడేది తమిళే'' కళ్లు విప్పార్చి చూస్తున్న సరోజ్‌తో చెప్పాడు అశోక్.

సరోజ్ మనసు కుదుటపడింది. దర్శనం కనీసం ఆరున్నరా, ఏడింటికైనా వెంటనే తిరుపతి చేరుకొని ఏ హైటెక్ బస్సులోనో రాత్రే హైదరాబాద్‌కు బయలుదేరవచ్చు. అశోక్‌ను కలుసుకోవడం తన అదృష్టమనుకు

## కొంచెం కష్టం

**అందాల అరబోతలో అందెవేసిన చెయ్యి లాంటి సమీరారెడ్డి ఎప్పుడూ హేపీగా తిరుగుతుంటుంది. తనకి నచ్చిన ఫ్రెండ్‌తో జల్సా చేసే ఈ భామ ప్రస్తుతం 'అశోక్'లో నటిస్తోంది. కొత్తదనంతో కూడిన పాత్రలేవైనా తనకిష్టమే అని చెప్పే సమీరారెడ్డి అందాన్ని మరింత పెంచుకునేందుకు రకరకాల చిట్కాల్ని పాటిస్తుంటుంది. అయితే షూటింగ్ టైంలో ఇలాంటివి పాటించడం కొంచెం కష్టమే అంటోంది.**



తన అదృష్టమనుకున్నాడతను.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, హోటల్లో భోజనం చేసి కాటేజీకి చేరుకున్నారు. బిల్లు సరోజే చెల్లించాడు. డిప్లొమా చేసి తాను వర్క్‌షాపులో ఫిట్టరుగా పనిచేస్తున్నట్లు చెప్పాడు అశోక్ మాటల సందర్భంలో.

''బాగా అలసటగా వుంది. ఐదునిమిషాల్లో స్నానం చేసి వస్తాను'' చెప్పాడు సరోజ్ గదికి చేరుకో గానే.

''గీజర్ వేసుకోండి, వేడి నీళ్లతో స్నానం చేయ వచ్చు'' చెప్పాడు అశోక్ పడకపై వాలుతూ.

''అవసరం లేదు, నాకు చన్నీళ్లు అలవాటే. పైగా ఎండలు మండిపోతున్నాయి'' షర్ట్ తీసి హేంగర్‌కు తగిలిస్తూ చెప్పాడు సరోజ్. ''చన్నీళ్లే బెస్టు ఈ సీజన్లో.''

సూట్‌కేస్‌లోంచి టవలూ, లుంగీ, సోప్ బాక్సు తీసి తిరిగి దాన్ని లాక్ చేసి బాత్రూంలోకి దూరాడు సరోజ్. కూనిరాగాలు తీస్తూ, స్నానం ముగించి బయటకు వచ్చేసరికి అశోక్ కనిపించ లేదు.

బహుశా ఏ వక్కపొడి కోసమో, టీ తాగడా నికో వెళ్లివుంటాడని పది నిముషాలు వెయిట్ చేశాడు సరోజ్. అశోక్ జాడ లేదు.

ఏదో అనుమానం వచ్చి హేంగర్‌కు తగిలించి వున్న తన షర్ట్, ఫేంట్ జేబుల్లో చూశాడు. అతడి గుండె గుభేలుమంది.

షర్ట్ జేబులో వున్న మూడు వందలుతోపాటు జేబులో వుండాల్సిన నాలుగు ఐదువందల రూపా యల నోట్లు కనిపించలేదు. కానీ టేబుల్‌పై వాచీ, సెల్‌ఫోన్ మాత్రం అలానే వున్నాయి.

''ఓ మైగాడ్! ఘోరం జరిగిపోయింది. ఈ అశోక్‌గాణ్ణి అనవసరంగా నమ్మి బోల్తాపడ్డాను'' గబగబా షర్టు పాంటు వేసుకొంటూ తన్ను తాను తిట్టుకున్నాడు సరోజ్. తనది రిలయన్స్ సెల్‌ఫోన్ కాబట్టి దాన్ని అశోక్ తీసుకెళ్లకపోయి వుండవచ్చు నని అనిపించిందతనికి. దానికి సిమ్‌కార్డ్ మార్చే అవకాశం లేకపోవడంతో, ఎక్కడున్నా ట్రేస్ చేయ వచ్చు. గేమ్స్ ఆడుకొనేందుకు తప్ప ఎందుకూ పని కిరాదది తీసుకెళ్లినవారికి.

కొద్దిదూరం నడవగానే కాటేజీల వద్ద వుండే అటెండరు కోటయ్య కనిపించాడు. ''ఎక్కడికి సార్ హడావిడిగా వెళ్తున్నారు'' అడిగాడు సరో జ్‌ను.

సరోజ్ కంగారుపడుతూ జరిగింది వివరిం చాడు.

''పదండి సార్, పక్కనే పోలీస్ స్టేషను వుంది. కంప్లైంట్ ఇద్దురు'' అని పోలీస్ స్టేషన్‌కు సరోజ్‌ను తీసికెళ్లాడు కోటయ్య.

★ ★ ★

ఎస్సై హాల్లో బిజీగా ఫైల్స్ చూసుకుంటు న్నాడు. వరండాలో ఇద్దరు కానిస్టేబుల్స్ బెంచీలపై కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

సరోజ్ చెప్పిన విషయం విని పదినిముషాలు వరండాలో వెయిట్ చెయ్యమన్నారు. పది నిమి షాల తరువాత ఎస్సైని కలుసుకొని, తన డబ్బు చోరీ జరిగిన విషయం చెప్పాడు సరోజ్.

''కొత్తప్లేస్‌లో అజాగ్రత్తగా వుంటే ఇలాగే జరు గుతుంది. ముక్కూ మొహం తెలియనివాణ్ణి ఎవరు నమ్మమన్నారు? మీరు కంప్లైంట్ చేసినా పెద్దగా ఫలితం వుండకపోవచ్చు'' చెప్పాడు ఎస్సై విసుగ్గా.

సరోజ్ మొక్కుబడికి ఒక కంప్లైంట్ ఇచ్చి వెను తిరిగాడు.

విసుగ్గా గదికి తిరిగి వచ్చి, మంచంపై నిస్త్రాణగా వాలిపోయాడు. వెంటనే ఒక ఐడియా వచ్చి తన బేగ్‌లోంచి తెల్లకాగితం ఒకటి తీసుకొని పెన్సిల్‌తో అశోక్ బొమ్మ గీయసాగాడు.

★ ★ ★

బెరుగ్గా ఆ ఆఫీసులో అడుగుపెట్టాడు అశోక్. అతని అసలు పేరు అది కాదు. 'ముత్తుమణి' అతని పేరు. సరోజ్‌కు చెప్పినట్లు విజయవాడ అతని వూరు కాదు, సేలంలో వుంటాడతను.

అల్లరి చిల్లరిగా తిరుగుతూ టెన్త్‌క్లాస్ రెండు సార్లు తప్పాడు. తండ్రి కేకలు వేయడంతో ఇంటి నుంచి పారిపోయి చెన్నై చేరాడు. అక్కడ ఒక ముఠాలో చేరి జేబుదొంగగా మారాడు.

రెండ్రోజుల క్రితం తిరుపతికి వచ్చాడు. సరో జ్‌ను తెలివిగా మోసగించగలిగాడు. డబ్బుతో ప్రయాణించడం రిస్క్ అని తోచిందతనికి. బస్సులో జేబుదొంగలుండవచ్చు. పైగా సరోజ్ ఈ సరికే పోలీసులకు ఫిర్యాదు చేసివుంటాడు. ఎవరైనా తనను చెక్ చేస్తే ప్రమాదం.

రెండుగంటల పాటు రోడ్లపై తిరిగి హెడ్ పోస్టా ఫీసులోకి ప్రవేశించాడు. మనియార్డర్ అని ఎర్రటి బోర్డుపై వున్న తెల్లటి ఇంగ్లీషు అక్షరాలను కూడి కూడి చదివాడు.

''సేలంకు ఈ డబ్బును ఎమ్వో చేయండి'' కౌంటర్లోని క్లర్కుతో చెప్పాడు. సేలంలోని తన స్నేహితుడి దగ్గర డబ్బు దాస్తున్నాడు కొంతకా లంగా ముత్తుమణి.

''ఫారమ్ పిలప్ చేయండి'' కౌంటర్లోని వ్యక్తి తల ఎత్తకుండా రాసుకుంటూ చెప్పాడు.

''నాకు ఇంగ్లీషులో రాసేది సరిగా రాదు. మీరే ఆ ఫారమ్‌ను పూర్తి చెయ్యండి'' చెప్పాడు ముత్తు మణి, చుట్టూ చూస్తూ కంగారుగా.

కౌంటర్లోని గుమాస్తా తల పైకెత్తి ముత్తుమణి వంక పరీక్షగా చూశాడు.

''కాసేపు కూర్చోండి. సిస్టమ్ ఫెయిల య్యింది. కాసేపటికి బాగైపోతుంది'' చెప్పాడు కౌంటర్ క్లర్కు.

''సరే, మాన్యువల్‌గా మీ ఫారమ్‌ను ఫీడ్ చేస్తాను ఇటివ్వండి'' అని ముత్తుమణి చేతిలోంచి డబ్బును అందుకుని లెక్కబెట్టాడు: సరిగ్గా రెండు వేల మూడువందలు ఉన్నాయవి.

ఇక్కడ సంతకం చేయండి. ఫారంను మణికం దజేశాడా యువకుడు. తమిళంలో ఏదో గెలికాడు ముత్తుమణి.

''ఔను, నాలుగు గంటలకు పోలీస్ సి.ఐ. విష్ణు ఇటొస్తానన్నాడ్లే, వాళ్ల బ్రదర్ అలియన్స్ గురించి నీతో ఏదో మాట్లాడాలట'' అప్పుడే ఆఫీసులోకి అడుగుపెడ్తున్న సహోద్యోగి గోపాల్‌తో అన్నాడు కౌంటర్ క్లర్క్.

ముత్తుమణికి టెన్షన్ ఆవరించింది. కొత్త వూరు, అందునా తనకిక్కడ తెలిసినవాళ్లెవరూ లేరు.

''రసీదు తీసుకోండి'' అని చెబుతున్న క్లర్కు రామం మాటలు పట్టించుకోకుండా గబగబా ఆఫీసు బయటకు నడిచాడు.

''విష్ణన్నా, ఇక్కడికెందుకొస్తాడు? అలియన్సే మిటి?'' అంటున్న గోపాల్‌ను చిరునవ్వుతో సస్పె న్సులో పెట్టి, రామం తన ముందున్న కంప్యూ టర్లో తన మెయిల్ బాక్సుకు వెళ్లి, సరోజ్‌కు మెయిల్ చేయసాగాడు.

''సరోజ్, నీది చాలా అదృష్ట జాతకం. ఆ విషయం ముందు మీ నాన్నకు చెప్పు. నువ్వు చక్కగా బొమ్మ గీసి, ఫోటో అటాచ్‌మెంట్‌తో నాకు పంపిన మెయిల్ పావుగంట ముందే అందింది. నీ డబ్బు పోయినందుకు చాలా బాధప డ్డాను. అనుకోకుండా ఆ దొంగ ఇటే వచ్చి ఆ డబ్బును ఎక్కడికో ఎమ్వో చేయమని నాకిచ్చాడు. మనిషిని చూడగానే నీ ఆర్ట్‌వర్క్‌లోని వాడే అని గ్రహించాను. పైగా వాడిచ్చిన ఐదు వందల రూపా యల నోట్ల మీద నువ్వు రాసిన నెంబర్లే వున్నాయి. ఆ నెంబర్లు నువ్వు నోట్ చేసుకోవడం మంచిద య్యింది. అలాగే మనవాళ్లందరికీ మెయిల్స్ ఇవ్వడం కూడా! దొంగగార్ని ఎంగేజ్ చేసి పోలీసు లను పిలిపించాలనుకున్నాను. లోపలికి వెళ్లి ఫోన్ చేస్తే స్టేషన్ నెంబరు ఎంగేజ్ వస్తోంది. ఈలోగా మీ దొంగ స్నేహితుడు గాబరాగా బయటకు బయల్దే రాడు. వాణ్ణి బందిద్దామంటే కొలీగ్స్‌గాని, జనం కానీ ఎవరూ లేరు. నేనూ బిక్కప్రాణినైపోయాను.

మీ అశోకును పిలిచి, డబ్బు తీసుకుని హైదరా బాదులోని నీ అడ్రస్‌కు ఎమ్వో చేసాను. ఇంగ్లీషు రాదని ముందే చెప్పాడుగా. గుడ్డిగా తమిళంలో సంతకం పెట్టి, రసీదు కూడా తీసుకోకుండా పరిగె త్తాడు పోలీసుల మాట వినగానే.

ఈసారి తిరుపతి వచ్చినప్పుడు మంచి గిఫ్ట్ కొనివ్వు నాకు.. బై!''

ఇట్లు,
రామం బావ.

☆